# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

- పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ • కాకర్లపల్లి పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- అల్పాహారం బాగున్నదని కితాబు



విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

మంథని రూరల్, అక్టోబర్ 12: ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ టీచర్లకు సూచించారు. గురువారం ఆయన మంథని మండలం కాకర్లపల్లి మండల పరిషత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఆరగించారు. టిఫిన్ బాగున్నదని కితాబిచ్చారు. ఇదే నాణ్యతను కొనసాగించాలని సూచించారు. పిల్లలతో కలిసి కూర్చుని ఆప్యాయంగా ముచ్చటించారు. నోటు పుస్తకాలను పరిశీలించారు. 'మీరు భవిష్యత్‌లో ఏమవుదామనుకుంటున్నారు..మీ లక్ష్యాలేంటి..'అని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు స్కూల్‌కు వచ్చి అల్పాహారం, మధ్యాహ్న భోజనం తీసుకుంటూ చక్కగా చదువుకోవాలని ఉద్బోధించారు. పాఠశాల ఆవరణలో న్యూట్రీగార్డెన్ ఏర్పాటు చేసి, కూరగాయలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్దేశించారు. అనంతరం స్కూల్ ప్రాంగణంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఆయన వెంట డీఈవో మాధవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ అంటే కాళేశ్వరం..
# కాంగ్రెస్ అంటే శనేశ్వరం

వారంటీలేని హస్తం పార్టీని నమ్మద్దు

- గ్యారెంటీ ఉన్న గులాబీ పార్టీని గెలిపించండి
- పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి
- బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకుల చేరిక
- ఎలిగేడు మండలం లాలాపల్లి, బురహన్‌మియాపేటలో ప్రచారం



ఎలిగేడు మండలం లాలపల్లిలో వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి/ఎలిగేడు అక్టోబర్12: 'బీఆర్ఎస్ అంటే కాళేశ్వరం..కాంగ్రెస్ అంటే శనేశ్వరం' అని పెద్దపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. వారంటీ లేని హస్తం పార్టీని నమ్మద్దని, గ్యారెంటీ ఉన్న గులాబీ పార్టీని ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. గురువారం ఆయన ఎలిగేడు మండలం లాలాపల్లి, బురహన్‌మియాపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. లాలపల్లి, ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయాచోట్ల మాట్లాడారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో ముందుంటూ దేశానికే దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ఓటేస్తే కన్నీళ్లు మిగలడం ఖాయమని పేర్కొన్నారు. 24 గంటల ఫ్రీ కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేస్తున్న గులాబీ పార్టీని ఆదరించాలని కోరారు. పని చేసే కార్యకర్తలను కడుపులో పెట్టి కాపాడుకుంటామని పేర్కొన్నారు. చేరినవారిలోల మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి, రెడ్డి సంఘం బోర్డు మెంబర్ కోమటిరెడ్డి కిషన్ రెడ్డి, ర్యాకలదేవ్‌పల్లికి చెందిన గోపు రవీందర్ రెడ్డి, కల్వల సంజీవరెడ్డి, మల్లేశ్ అజయ్ రెడ్డి, లచ్చయ్య, కాసర్ల సాగర్ రెడ్డి, గోపు జితేందర్ రెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో ఎలిగేడు ఎంపీపీ తానిపర్తి స్రవంతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, సర్పంచ్ రాచర్ల కొండయ్య రాజ, సర్పంచులు, తానిపర్తి మోహన్‌రావు, మండిగ రాజనర్సయ్య, నాయకులు బద్దం తిరుపతిరెడ్డి, కల్లెం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తో అభివృద్ధి..
# కాంగ్రెస్‌తో అధోగతి

- పెద్దపల్లి బల్దియా చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి
- 20, 24 వార్డుల్లో ఇంటింటా ప్రచారం • ఆత్మీయంగా పలుకరిస్తూ ముందుకూ



పెద్దపల్లి: 24వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి

పెద్దపల్లి, అక్టోబర్12: 'బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి సాధ్యం.. పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే అధోగతి ఖాయం.' అంటూ పెద్దపల్లి బలియా చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం ఆమె పట్టణంలోని 20, 24 వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆత్మీయంగా పలుకరిస్తూ, యోగక్షేమాలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కారు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా దాసరి మనోహర్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అరవై ఏండ్ల కాంగ్రెస్ పాలన, తొమ్మిదేండ్ల పాలనను బేరీజు వేసుకొని ఓటేయాలని కోరారు. పెద్దపల్లిలో నాడు గుక్కెడు నీళ్లు దొరక్క గొంతెండే దయనీయ పరిస్థితులు ఉండేవని, కానీ ఈనాడు మిషన్ భగీరథతో స్వచ్ఛమైన నల్లానీరు అందుతున్నదని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల మాయమాటలను నమ్మవద్దని సూచించారు. పెద్దపల్లి ప్రజలకు ఏంచేసిన్రో చెప్పాలని నిలదీయాలన్నారు. చేసిన పనులను చూసి బీఆర్ఎస్‌కు పట్టంగట్టాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గాదె మాధవి, మొబిన్, స్వామి, శ్రీధర్ పాల్గొన్నారు.

# రామగుండంలో మళ్లీ ఎగిరేది
# గులాబీ జెండానే

- పదేండ్లలోనే వందేండ్ల ప్రగతి
- సీఎం కేసీఆర్ పథకాలు దేశానికి ఆదర్శం • రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- 42వ డివిజన్‌లో ప్రజా అంకితయాత్ర



గోదావరిఖని: ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళ

గోదావరిఖని, అక్టోబర్ 12: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో పదేండ్లలోనే వందేండ్ల ప్రగతి సాధించామని చెప్పారు. కేసీఆర్ పాలనలో పథకం అందని గడపలేదని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు, సీనియర్ సివిల్‌కోర్డులను నెలకొల్పి ఐటీ పార్కును ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారని కొనియాడారు. బుధవారం రాత్రి రామగుండం 42వ డివిజన్‌లో బస్తీనిద్ర చేశారు. గురువారం ఉదయం ప్రజాఅంకితయాత్రలో భాగంగా వాడవాడలా కలియదిరిగారు. ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. మహిళలు మంగళహారతులిచ్చి, నుదుట తిలకం దిద్ది ఆశీర్వదించారు. అనంతరం కోరుకంటి మాట్లాడుతూ రామగుండం బల్దియా పరిధిలో ₹300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అన్ని డివిజన్లలో రోడ్లు వేశామని, అర్హులందరికీ పథకాలు అందజేశామని చెప్పారు. ఇదంతా మీ కండ్ల ముందరే కనిపిస్తున్నదని, మళ్లీ గెలిపిస్తే రామగుండం నియోజకవర్గాన్ని సిరిసిల్ల, సిద్దిపేట తరహాలో తీర్చిదిద్దుతానని ప్రకటించారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కనిపించని బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఓట్లకోసం మొసలికన్నీళ్లు కారుస్తున్నారని మండిపడ్డారు. వారిని నమ్మితే అధోగతి పాలుకాకతప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి బీఆర్ఎస్‌ను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, రాష్ట్ర నాయకురాలు మూల విజయారెడ్డి, డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు, కార్పొరేటర్లు రాజ్‌కుమార్, నాయకులు ఆడెపు శంకర్, పిల్లి రమేశ్, మెతుకు దేవరాజ్, రాంచందర్, మండల సత్యనారాయణ, మహేందర్, నంబయ్య, లక్ష్మీనారాయణ, పుట్ట రాజేశ్, కవిత, మీనాక్షి, పద్మ, శ్రీకళ, స్వప్న, అనూష తదితరులు ఉన్నారు.

# కొప్పుల గెలువాలని పెద్దయ్య దేవుడికి మొక్కులు



ధర్మారం: పెద్దయ్య దేవుడికి మొక్కుకుంటున్న కొత్తూరు ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

ధర్మారం,అక్టోబర్ 12: రాష్ట్ర మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఘన విజయం సాధించాలని కొత్తూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు పెద్దయ్య దేవుడికి మొక్కుకున్నారు. గ్రామానికి చెందిన 40 మంది యూనియన్ మెంబర్లు గురువారం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పెద్దయ్య దేవుడిని దర్శించారు. ఆలయంలో పూజలు చేశారు. కొప్పుల ఈశ్వర్ మళ్లీ గెలవాలని మొక్కుకున్నామని చెప్పారు. ఇక్కడ సర్పంచ్ తాళ్ల మల్లేశం గౌడ్,ట్రాక్టర్ యూనియన్ చైర్మన్ బానోతు రాజేశ్ నాయక్, ఉపాధ్యక్షుడు సామల రాజయ్య, ప్రధాన కార్యదర్శి సాయిని కొమురయ్య, కోశాధికారి కడారి తిరుపతి ఉన్నారు.

# కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మద్దు

- కారుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించండి
- రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి స్నేహలత
- నర్సింహులపల్లి, ఖిలావనపర్తి, దొంగతుర్తి, రామయ్యపల్లిలో పర్యటన • మహిళలతో సమావేశం



దొంగతుర్తిలో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సతీమణి స్నేహలత

ధర్మారం,అక్టోబర్ 12: 'కాంగ్రెస్ పార్టీ మోసపూరిత గ్యారెంటీలను నమ్మవద్దు..మీకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి శ్రమిస్తున్న కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించండి' అంటూ మంత్రి సతీమణి , ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు కొప్పుల స్నేహలత పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని నర్సింహులపల్లి, ఖిలావనపర్తి, దొంగతుర్తి, రామయ్యపల్లి గ్రామాల్లో పర్యటించారు. మహిళలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్నేహలత మాట్లాడుతూ తెలంగాణలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు మేలు చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా ఆసరా పథకం కింద వృద్ధులకు పెద్దకొడుకులా పింఛన్లు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు ఆలోచించి ఓటేసి పనిచేసిన వారిని గెలిపించాలని కోరారు. తాను ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌ద్వారా నియోజకవర్గంలో చేసిన సేవలు ఎంతో సంతృప్తిని ఇచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, సర్పంచులు అడువాల అరుణజ్యోతి, సాగంటి తార, ముత్యాల చంద్రశేఖర్, రేగుల సందన్‌బాబు, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ పాకాల రాజయ్య, ఎంపీటీసీలు మోతె సుజాత, దాడి సదయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షురాలు గుజ్జేటి కనకలక్ష్మి పాల్గొన్నారు.